10401870|

# ప్రబోధం

లోకమందు పెక్కు భీకర కృత్యముల్      పాపభీతి లేని పామరత్వము బట్టి
జరుగు కారణంబు అరయవలయు      దైవప్రీతి లేని దాని బట్టి
స్వార్థరహిత సేవ సన్నగిల్లుట చేత      మానవత్వమడగె మానవులందున
అర్థరహిత వాంఛలధికమయ్యె.      విశ్వశాంతికి డియు విప్లవంబు.

ప్రేమస్వరూపులారా!

కాలముచేత మారని, చరిత్రముచేత మాయని, ప్రళయముచేత తరగని సృష్టిచేత పెరుగని యే సత్యమైతే వున్నదో ఆ సత్యమునకు రూపవిలాసమే భారతీయుల సంస్కృతి. ఈ సంస్కృతికి వేదమే మూలము. వేదమునుండి ఆవిర్భవించినదే ఉపనిషత్తు. ఈ ఉపనిషత్ సారమే గీత. గీతయొక్క రసమే బ్రహ్మసూత్రము. ఈ మూడును అవినాభావ సంబంధము. అన్యోన్య ఆశ్రయములు. ఇవి శ్రవణ మనన నిధిధ్యాసములతో కూడినది. ఉపనిషత్తులు శ్రవణాత్మకమైనవి. బ్రహ్మసూత్రము మననాత్మకమైనటువంటిది. భగవద్గీత నిధిధ్యాసాత్మకమైనది. ఇవి కేవలము జ్ఞానమయమైన స్వరూపములే కాని వాఙ్మయ స్వరూపములు కావు.

కానీ యీనాడు యీ పవిత్రమైన సూత్రములను వాఙ్మయముగా భావించటము చేతనే మానవుడు యుగములు గడచినా, తరములు మారినా తానున్న స్థానమునుండి అడుగైనా ముందుకు పోలేకపోతున్నాడు. భగవద్గీత భారతీయులయొక్క వాక్కు అని మతగ్రంథమని యిదే విధముగా యనేక గ్రంథములు ఆయా మతములను పురస్కరించుకొని వాదోపవాదములలో దిగటం జరుగుతూవుంది.

ప్రేమస్వరూపులారా! వేరు వేరుగా భావించక, సర్వమతముల సారము సర్వగమ్యముల చేరిక యేకత్వమనే దివ్యత్వాన్ని గుర్తించి వర్తించినప్పుడే మనయొక్క దివ్యజీవితమే కాకుండా దేశము కూడను వుద్ధరించినవారమౌతాము. భగవద్గీత ఒక భారతీయులకు మాత్రమే చెందినది కాదు. దీనికి యీమాత్రము పరిమితము యుంచరాదు. కేవలము హిందూమతమునకు సంబంధించినదనే మనము భావిస్తున్నాము. ఇది సంకుచితమైన భావమే. దేశపరిస్థితుల ప్రభావమననుసరించి కాలకర్మకారణ కర్తవ్యములను పురస్కరించుకొని కేవలము యీ పవిత్రమైన గ్రంథమును జగత్ వ్యాప్తిగావించినదనే సత్యాన్ని గుర్తించాలి. అన్ని దేశీయులకు, అన్నిమతములవారికి యీ భగవద్గీత ప్రాణసమానము. భగవంతుని గూర్చి తెల్పు గ్రంథములన్నియు భగవద్గీతలే. ఖురాను అనేది యిస్లాముల గ్రంథమని, బైబిలు క్రైస్తవులకు మాత్రమే సంబంధించినదని, గ్రంథరాజమనేది

దికేవలము సిక్కులకు మాత్రమే సంబంధించినదనియు, యీవిధముగా కేవలము గ్రంథములను ఆధారము చేసుకొనియే తమయొక్క ఆత్మికత్వమును, దివ్యత్వమును కోల్పోతూ ఒకరినొకరు యనేకవిధములుగా భేదాభిప్రాయములు పెంచుకొని, భిన్నభావముల చేత, తమయొక్క దివ్యత్వమును గుర్తించుకొనలేక జీవితమును వ్యర్థము గావించుచున్నారు. అమూల్యమైన కాలమును అరక్షణమైనా కూడను వృథా చేయకూడదనేటువంటి సత్యాన్ని వారు గుర్తించుకోలేకపోతున్నారు. అనేకమంది వేదవేత్తలు అనేక భాషలయందు, అనేక విధములుగా యీ భగవద్గీతను రచించి, వ్యాఖ్యానించి, యనేకవిధములుగా దీనిని వ్యాప్తిగావించుచున్నారు. ప్రచార ప్రబోధలు ప్రపంచమంతయు వ్యాపించినప్పటికి ఆచరణలో యేమాత్రము కనుపించుటలేదు. ఆచరణరూపమైన ప్రచార ప్రబోధలు యీనాడు అత్యవసరము. ఇది పారాయణ గ్రంథము కాదు. ఇది ఆచరణ యోగ్యమైనటువంటిది. ప్రాజ్ఞులు ఒక స్వాములవారు దీనిని గురించి యనేకవిధములుగా బోధించారు. విద్యాప్రకాశానందులవారు దీనిని గురించి సమత్వాన్ని బోధిస్తూ, నిత్యత్వాన్ని విశ్వసిస్తూ, దివ్యవ్యాప్తి గావించవలసినటువంటి విధానమును కూడను తెలుపుతూ వచ్చారు.

అయితే యీనాటి కాలపరిస్థితిని పురస్కరించుకొని భగవద్గీతను యేవిధముగా యీ జగత్తునకు అందించాలి అనేటువంటి విషయము మొట్టమొదటగా యీ సాధుసంఘము గుర్తించటానికి ప్రయత్నించాలి. కేవలము భగవద్గీతను ఆధారము చేసుకొని కృష్ణుడు ఉవాచ, అర్జునడవాచ అని దేహధారులను మాత్రమే ఆధారము చేసుకొని మన ప్రచార ప్రబోధములో ప్రవేశిస్తున్నామేగాని యిది సర్వమానవులకు ఆధారమైనటువంటి సత్యమనేదానిని గుర్తించి యీ దేహధారులు కాకుండా జీవేశ్వరుల యొక్క సంబంధమును యిందులో యిమిడ్చి తద్వారా సమాజములో ప్రచారము సలిపినప్పుడే ప్రజలలో అంతో యింతో వుండినటువంటి ఆస్తిక స్థితి యెంతైనా అభివృద్ధి పొందుటకు వీలవుతుంది. అర్జునుడు యేమడిగాడు, కృష్ణుడు యేమి చెప్పాడు గీతయందు స్పష్టముగానే వుంటున్నది. ఇంకను మనయొక్క ప్రబోధలు ప్రచారములు యెందుకు. పారాయణమునకు గ్రంథము చాలదా? పారాయణము చేసినంతమాత్రమున పరతత్త్వము మనకు ప్రాప్తిస్తుందా?

అంధకారమెల్ల హాతమారునే చూడ - వసుధలో దీపంబు వార్తవలన
నిరుపేదవాని పేదరికంబు పోవునా - విత్తప్రభావంబు విన్నయంత
రోగపీడితుని బలు రోగము పోవునా ఔషధమహిమ విన్నయంత.

పారాయణవల్ల లభించే ఫలితమిట్టిదే. పారాయణము చేయుటము కాలమును పవిత్రము చేయుటమాత్రమే. పరతత్త్వమును అనుభవించి, పరమాత్మునిలో ఐక్యము గావించుకోటానికి, దీనిని ఆచరించినప్పుడే దానియొక్క ఆనందము అనుభవమునకు వస్తుంది. భగవద్గీత అనునటువంటిది ఒక మార్గము మాత్రమే. ఒకమార్గమునందు మనము కూర్చొని ఒకగ్రామము చేరాలని ఆ గ్రామమునకు చేరే మార్గము యిదే యిదే అని వుచ్చరించినంత మాత్రమున మనము గ్రామమును చేరగలమా? పాత్రలో పంచభక్ష్య పరమాన్నము, పంచభక్ష్య పరమాన్నము అని యెన్నిపర్యా

యములు స్మరించినప్పటికి మన పొట్ట నిండదు. ఆకలి తీరదు. బలశాంతులు లభించవు. తిట్టిలో నున్నపదార్థము పొట్టలో చేరవలెనన్న నోటికి చేతికి పనిపెట్టాలి.

అదే విధముగా మన చేతలయందు, మన భావములయందు, వాక్కునందు ఏక స్వరూపాన్ని ధరించినప్పుడే త్రికరణశుద్ధిగా యీ భగవద్గీత మనకు అర్థమవుతుంది. భగవంతుడు ఒక స్థితి. ఒక గ్రామము వంటి వాడు. ఒక గమ్యము వంటివాడు. ఆ గమ్యము మనము చేరవలెనన్న గీత అనే మార్గమును అనుసరించినప్పుడే ఆ గమ్యాన్ని మనము చేరగలము. గీతను మార్గముగా విశ్వసించి భగవంతుని గమ్యముగా మనము తలంచి, మార్గములో మనము ప్రయాణము సలిపినప్పుడు, అనగా ఆచరణలో వుంచినప్పుడే మనము చేరవలసినటువంటి స్థానాన్ని సుక్ష్మముగా చేరగలము.

భగవంతుడు చెప్పినటువంటి వాక్యములు ఒక జాతికి ఒక మతమునకు, ఒక కులమునకు, ఒక వర్గమునకు మాత్రమే సంబంధించినటువంటిది కాదు. ఈ జాతిమతములు గుణములనుండి ఆవిర్భవించినటువంటివి. గుణములు భ్రమస్వరూపాన్ని ధరించినటువంటివి. ఈ గుణములనే భ్రమ మనయందు వుండినంత వరకు బ్రహ్మ మనకు ప్రాప్తించదు. భగవంతుడు గుణాతీతుడు. భ్రమరహితుడు. భ్రమను నిర్మూలము గావించినటువంటివాడు. అట్టి నిర్మూలస్థాయియందు, గమ్యమైనటువంటి ధర్మమునందు మానవత్వాన్ని గుర్తించటానికి తగినటువంటి ఆచరణ మనము అనుభూతిలోకి తెప్పించుకోవాలి.

గుణాతీతమైన దివ్యత్వాన్ని గుణములచేత పొందటానికి ప్రయత్నించటము కేవలము భ్రమ అనే చెప్పవచ్చు. భ్రమస్వరూపులైనటువంటి జిజ్ఞాసువులకు తిరిగి భ్రమనే మనము బోధించి భ్రమను భ్రమగానే పెంచి తరువాత వారిని మరింత బంధితుని గావించుచున్నది. మన ప్రబోధలు గానీ ప్రచారములు గానీ ప్రజారంజకము గావచ్చు. ఆనందముగా వారికి అనిపించవచ్చు. కానీ దేహము కనుపించును. మనసు వున్నదని అనిపించును. కానీ ఆత్మతత్త్వమనేటువంటి వునికి దానిని మనము పట్టటానికి వీలుకాదు. ఇలాంటి పరిస్థితులయందు మనము ప్రచారమనేటువంటిది వారికి చాలా శ్రేయస్కరమైనటువంటిదిగా బోధించాలిగానీ, ప్రేయస్సునకు సంబంధించినటువంటివిగా వుండకూడదు. వారికి ప్రియములు కదాయని యేవో కొన్ని కొన్ని కథలద్వారా వారిని ఆనందపరచేటువంటి మార్గములో మనము ప్రవేశించరాదు. ఇవి తాత్కాలికమైనటువంటి, ఉల్లాసములు ఉత్సాహములు అందించునే గానీ శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైనటువంటి దైవత్వాన్ని వారిలో యు మాత్రము కూడను హత్తుకొనుటకు అవకాశము వుండదు. పురాణముల ద్వారా, పవిత్రమైన కథల ద్వారా దైవత్వమైనటువంటి దివ్యత్వాన్ని వర్ణించటము పౌరాణికుల లక్ష్యము. కానీ సన్యసించినటువంటివారు, నిత్యమైన సత్యమైన దైవత్వాన్ని తాము అనుభవించి, తాము పెంచుకొని పరులకు పంచటానికి తగినటువంటి కృషి చెయ్యాలి.

ఎన్నియో సంవత్సరములనుండి యెంతయో వ్యాఖ్యానము గావించినటువంటి మహనీయులు భగవద్గీత తత్త్వాన్ని ప్రచార ప్రబోధలు చేస్తూనే వస్తున్నారు. కానీ యీనాటి వరకు

దీనిని అభ్యసిస్తూ వస్తున్నారు. ఎంత దీనిని సాధించారు. ఏ విధమైనటువంటి మార్పు కలిగింది అనే విషయము విచారిస్తే మనకు నూటికి ఒక్కరో కోటికి ఒక్కరో కూడను కనుపించరు. మనకు యేపది మందైననూ ఆచరణాయోగ్యులు చాలు. గంగిగోవుపాలు గరిటెడైనను చాలు కడవెడైన నేల ఖరము పాలు. కనుక యీనాడు మనము ప్రారంభించవలసినటువంటి భగవద్గీతను ఆచరణాయోగ్యమైనటువంటిదిగా, అనుష్ఠానరూపమైనటువంటిదిగా విశ్వసించి, ఆచరించి, ఆనందించి, సమాజమునకు అందించటానికి తగిన కృషి చెయ్యాలి. సాధువులు ఆచరణాయోగ్యులు. అనుష్ఠాన కుశలురు. వారి కాలమంతయు యీ విధమైనటువంటి ఆచరణలయందు సార్థకము గావించుకోటానికి తగిన ప్రయత్నము చెయ్యాలి. దాని నిమిత్తమై దండ కమండల కాషాయ వస్త్రములు ధరించారు. ఒక్క దైవము కోసమే తలలు గొరిగించుకున్నారు. దైవమునకు తనకు వుండినటువంటి సంబంధబాంధవ్యాన్ని గుర్తించి వర్తించటమే వారి ప్రధాన లక్ష్యముగా విశ్వసించాలి.

పాపభయంబు పోయె పరిపాటైపోయెను దుష్టవ్రతంబిలన్
శ్రీపతి భక్తిపోయె వివరింపగలేని దురంతకృత్యముల్
దాపురమయ్యె లోకమున తాపసలోకశరణ్యుడైన ఆ
శ్రీపతి నామ చింతనయె చేకురచేయు సుఖంబు మానవా!

పుస్తకములు పఠించితిని పూర్తిగ చూచితి సర్వశాస్త్రముల్
నిష్ఫలమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల
నీ హస్తయుగంబు మోడ్చి పరమాత్ముని భక్తితో కొల్వలేని
యీ ప్రస్తుత విద్యలన్నియు ధాత్రి నిరర్థకముల్ కదమానవా.

ప్రాచీన కాలము నుండి పవిత్రమైన భారతదేశమునందు అనుష్ఠానప్రియులైన పెద్దలను అనుసరించుచునే పిల్లలు జీవిస్తూ వచ్చారు. పెద్దలైనవారు యేవిధమైన మార్గమును అనుసరిస్తారో, దానినే పిల్లలు, అజ్ఞానులు, అమాయకులు దానినే ఆధారముగా తీసుకుంటారు. కనుక యీనాడు అన్ని విధముల పెద్దలైనటువంటి వారు, మహనీయులైనటువంటివారు, మహాత్ములైనటువంటి వారు ఆధారముపైననే యీ జగత్తు కొంతవరకును నిలచి వుంటున్నది. ఈ మహనీయులపైన అనేక విధములైనటువంటి బాధ్యతలు కూడను అధికముగా వుంటున్నాయి. నాయకులుగా వుంచినప్పుడు దానికి తగినటువంటి బాధ్యతను కూడను మనము వహించవలసి వస్తుంది. కానీ యీనాడు మనము అధికారము కొరకు ప్రాకులాడుచున్నాము కానీ, దీని కర్తవ్యాన్ని గుర్తించుకొనేటువంటి చిత్తమును యేమాత్రము మనయందు అభివృద్ధి కాకుండా వున్నది. అధికారముతోపాటు కర్తవ్యమును కూడ నిర్వర్తించాలి. మనధర్మాన్ని మనము గుర్తించాలి. ఇది దేహము ద్వారానే అనుభవింపజేయాలి. దేహము ద్వారానే ఆనందించాలి. శరీరమాద్యం ఖలు ధర్మసాధనం. కాన దేహమును ఆధారము చేసుకొనియే దేహిని మనము గుర్తించాలి.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహినిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ
ఆదేహియె దేవదేవుడని మదిన్ గమనించుడు ఆత్మరూపులై

జగత్తంతయు బ్రహ్మమయము. బ్రహ్మమయమైన జగత్తంతా కర్మమయము. సృష్టి అనునదే పెద్దకర్మ. కనుక కాయమే ఒక పెద్దకర్మ. కర్మ అనగా కేవలము ఒక ఆత్మశక్తి అనియే చెప్పవచ్చును. దీనికే జీవశక్తియని కూడను పిలువవచ్చు. ఈ జీవశక్తికి వుపాధియే శరీరము. జీవశక్తికి వుపాధియైనటువంటి దేహము ద్వారా కర్తవ్యమును గుర్తించటానికి తగిన కృషి చేయుటయే సాధన. దేహమే కర్మక్షేత్రము. ఆత్మయే బ్రహ్మక్షేత్రము. అదియే ధర్మక్షేత్రము. కనుక కర్మక్షేత్రమైనటువంటి దేహముద్వారా ధర్మక్షేత్రమైనటువంటి బ్రహ్మను మనము చేరటానికి తగిన కృషి చేయుటయే యీ భగవద్గీత యొక్క ప్రధాన సందేశము.

హృదయ మన్క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు
దానిచుట్టు వనస్పతుల కలుపకంప పెరిగియుండు
కలుపుతీసి చూడరయ్య కల్పతరువు కానపడును
అదియె శుభేచ్ఛనానగు శుభ కామధేనువు.

కేవలము బ్రహ్మసత్యం జగత్ మిథ్యయని వాక్యములతో చెప్పినంత మాత్రమున చాలదు. జగత్తంతయు బ్రహ్మమయమే. కానీ యీ జగత్తు రూపనామములతో కూడటంచేత యిది నిత్యానిత్యములతో కూడి వుంటుంటాది. ప్రతిపదార్థమునందు కూడను అస్తి భాతి ప్రియం, అదే చిత్ చిత్ ఆనంద స్వరూపముతో వున్నది. దానికే మన వినియోగ నిమిత్తమై రూపనామములు యిచ్చుకున్నాము. రూపనామములు మాత్రమే అనిత్యముగానీ సత్ చిత్ ఆనందమనేటువంటిది సత్యము. శాశ్వతము. అది నిర్గుణం నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్యశుద్ధ బుద్ధముక్త నిర్మలస్వరూపిణం. అట్టి నిత్యసత్యమైనటువంటి ఆత్మతత్వమును మిథ్యమని చెప్పుటకు యెట్లు సాధ్యమగును. దృశ్యమునకు రూపమున్నదిగానీ దృష్టికి రూపము లేదు. దృశ్యము చేతనే మనము ద్రష్టను అనుభవించాలి. కనుక రూపనామములు లేనటువంటి దృష్టితో ద్రష్టను మనము అనుభవించటమే సరియైనటువంటి సాధన.

మనము జగత్ సంబంధమైన వ్యవహారములలో వుండి, వాటితో సన్నిహితసంబంధ బాంధవ్యము ఉంచుకొని, దానిని త్యజింతుమంటే యిది చాలా కష్టమైన విషయము. గుండుపైన నిలచిన వ్యక్తి తాను నిలచుకొని గుండును పక్కను పెట్టాలంటే యిది సాధ్యమయ్యేటువంటి పనికాదు. గుండును ప్రక్కను పెట్టాలంటే గుండుదిగి తాను ప్రక్కను పెట్టటానికి ప్రయత్నించాలి. దీనినే వైరాగ్యమని చెబుతూవచ్చారు. వైరాగ్యమనగా

ఆస్తి ఆలివాడి అడవికేగుట కాదు
భావమందు దుష్టభావము విడుటే
త్యాగమగును అదియె యోగమగును.

అందులో మనము వుండి కూడను దానితో సంబంధ బాంధవ్యము లేకుండా మన యొక్క చిత్తమును పరమాత్మని హత్తుకొన్నట్లుగా చూచుకొనుటకు ప్రయత్నించాలి. ఉద్ధవుడు కృష్ణుని దగ్గరకు వచ్చినప్పుడు, స్వామి గుణాతీతమైనటువంటి వారికి కదా నీ తత్వము గుర్తించటానికి వీలవుతుంది. వ్యామోహకారణము చేత, దేహకారణము చేత, బుద్ధికారణము చేత తపించేటువంటి, యీ అజ్ఞానమైన గోపికలకు నీ యొక్క తత్వము యే విధముగా అర్థమవుతుంది. వారికి నీవు యే విధముగా వశము కాగలవు అని ప్రశ్నిస్తాడు. ఉద్ధవా గోపికల చిత్తము గుర్తించటానికి నీకు సాధ్యము కాదు.

అత్తలు మెత్తురున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న
నోరెత్తరు యెటుకోగరు భీతిల బోరు
గోపికల్ పాత్రము లందు చిత్తరువుల
రీతి వారిలో నుండు కృష్ణుడు.

ఒక కాగితము లోపల హత్తుకున్నటువంటి చిత్తరువు. ఆ చిత్తరువు వేరు కాగితము వేరు చేయుటకు వీలు కాదు. అదే విధముగనే వారి హృదయమునందు నా చిత్తరువు హత్తుకొనిపోయింది. అదే విధముగనే సాధకుల చిత్తమునందు భగవంతుడు హత్తుకొనిపోయినప్పుడే వారు అన్య కార్యములు చేసినప్పటికీ, యెన్ని కార్యములుగావించినప్పటికి యివి భగవత్ కార్యములుగానే రూపొందుతాయి.

ముఖ్యముగా మీరు ప్రచార ప్రబోధల యందు కంకణము కట్టుకొని దేశవ్యాప్తిగా యీ భగవత్ తత్వాన్ని ప్రచారము సలుపుతూ వుండటం ఆనందకరమైనటువంటి విషయము. ఇది చాలా ఆధారకరమైన విషయము. అయితే సమాజమునందున్నటువంటి వ్యక్తులు యీ కలియుగ ప్రభావము వల్ల తెలివితేటలు అధికముగను, గుణము చాలా అల్పముగను వుంటున్నది. చదువులు పెరుగు కొలది సందేహములు కూడా పెరుగుతూ వుంటాయి. ప్రతి చిన్న విషయాన్ని కూడను విమర్శించుటకు ముందంజ వేస్తారు. అర్థము చెప్పినను గుర్తించటానికి శక్తి లేకపోయినప్పటికి విమర్శించుట మాత్రము చాలా విజ్ఞి వేసుతుంటారు. ఇది అల్పగుణముల యొక్క లక్షణము. ఇలాంటి పరిస్థితులను మనము గుర్తించి వారికి యెట్టి అనుమానములు కూడను అవకాశము లేనటువంటి మార్గము అవలంబించాలి. దైవాన్ని సంపూర్ణముగా విశ్వసించినటువంటి వారు మీరు. మీ జీవితాన్నే అంకితముగావించినటువంటి త్యాగులు. ఇంద్రియములను నిగ్రహించి ఆ దైవత్వాన్ని మీ చిత్తమునందు హత్తుకున్నట్లు చేసుకున్న యోగులు. కానీ మన ప్రచారముల చేత ప్రబోధల చేత కొన్ని రకములైన సందేహములను మనయనమే కల్పించుచూ వస్తున్నాము. దైవము ఒక్కడే. అతను సర్వవ్యాపకుడు. సర్వజ్ఞుడు. సర్వశక్తిమయుడు అని మనమే చెపుతున్నాము.

మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
వస్త్ర భేదము వేరు దారమొక్కటే
శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే

1-04-01-87-07

దర్శనంబులు వేరు దైవంబు ఒక్కటె
పూలవన్నెలు వేరు పూజ ఒక్కటె.
తెలియలేకను మానవుల్ తెలివితప్పి
బ్రతుకుకోసము బహుబాధ బద్ధులైరి.

ఈబ్రతుకునిమిత్తమై మనము యిన్నిరూపనామములను కల్పించుకొనుచున్నామే గాని యదార్థమైన దివ్యదృష్టితో పరికించిన అందులో వున్నది ఒక్కటే. అదే ఏకోహం బహుశ్యాం. కొన్నినిముషల ముందుగా ఒకస్వామివారు చెప్పారు. బల్బులు యెన్నియో వున్నాయి కానీ మనము మెయిన్ స్విచ్ ఆఫ్ చేస్తే అన్నిబల్బులు నిరర్థకమైపోతాయి. అదేవిధముగనే మానవులందరు వివిధరంగులలో, వివిధరూపనామములతో కూడినటువంటి బల్బులవంటివారు. సూత్రమణిగణాయివ అని అన్నిపూవులయందు కూడను ఒకేదారము చేరినట్లుగా అన్ని బల్బులయందును దివ్యత్వమనే ఆత్మతత్వము ఒక్కటిగానే వుంటున్నది. అట్టితత్వాన్ని మనము సమాజములో ప్రబోధిస్తూ రాములువేరు కృష్ణుడువేరు, బ్రహ్మవేరు విష్ణువువేరు, ఈశ్వరుడువేరు అనేటువంటి దీనికి మనము కొంత అవకాశము యిచ్చినప్పుడు దీనిపైన వాదోపవాదములు ప్రవహిస్తాయి. బ్రహ్మతత్వమనేటువంటిది ఆత్మస్వరూపములో ప్రతిజీవుని యందు వుంటున్నది. అదియే ప్రణవస్వరూపమైనటువంటి ఓంయిత్యేకాక్షరం బ్రహ్మ అనింది. ఆబ్రహ్మనే అయం ఆత్మబ్రహ్మ. అదే ఆత్మగా వచ్చింది అన్నారు. కనుక ప్రణవము, బ్రహ్మ, ఆత్మ అవినాభావ సంబంధము. ఏకస్వరూపము. కనుక దైవత్వమనేటువంటిది యీజగత్తునందు కానరాదు. సర్వనామములు అతనివే. సర్వరూపములు అతనివే. కానీ తాను మాత్రము నిత్యసత్యమై ప్రకాశిస్తుంటాడు. ఈబ్రహ్మతత్వమందు అనేకవిధములైన లక్షణములను వర్ణిస్తూవచ్చింది. అదే శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి అని అష్టైశ్వర్యస్వరూపిణిగా నిరూపించింది. ఇది అష్టైశ్వర్యస్వరూపుడైనటువంటి బ్రహ్మతత్వమనేటువంటిది. ఏమి తెలియనటువంటి అమాయకత్వముగా ఒక్కొక్కతూరి మనము బోధిస్తూవుంటాము.

ఈ భాగవతమునందు భక్తులప్రీతినిమిత్తమై, భక్తుల ఆకర్షణనిమిత్తమై, భగవంతునియందు భక్తిప్రపత్తులు అభివృద్ధిగావించుకొనే నిమిత్తమై కొన్నిరకములైన ఆకర్షణలను యిందులో యిమిడ్చివుంటారు. ఇది పౌరాణికము. మనము ఆకృష్ణునిపై వుండినటువంటి ప్రేమతత్వముచేత, అనురాగముచేత, ప్రపత్తిచేతను అతనిని యనేకరీతులుగా వర్ణిస్తూవుంటాము. ఆనాటి గోపికలు ప్రేమోన్మత్తులై, తన్మయులై, వున్మత్తులై కృష్ణునియొక్క పవిత్రమైనటువంటి దివ్యత్వము కోసమై అనేకవిధములుగా ఆరాటపడుతూ వచ్చారు. ఈభక్తిలో తన్మయత్వులుగావచ్చు. ఆత్మారాములుగావచ్చు. ఉన్మత్తులుగూడను కావచ్చు. అట్టిపరిస్థితియందు నిత్యానిత్యవిషయపరిశీలన శూన్యమవుతుంది. ఏదినిత్యము యేదిసత్యము అనేవిచారణశక్తివుండియూడను దానినివారు మరచిపోతారు. ఆప్రేమప్రభావము అట్టిది. ఒకానొకసమయములో కృష్ణుడురాకపోవటముచేత గోపికలందరు అడవులలో ప్రవేశించి, మొక్కలను, వృక్షములను పువ్వులను కూడను ప్రశ్నిస్తూవచ్చారు. మొక్క-

లకు చెప్పేటువంటి నోరున్నదా, పూవులకు చూచేటువంటి కన్నులున్నవా? వృక్షములకు యీ గోపికల ప్రార్థించేటువంటి ప్రార్థనలు వినేటువంటి చెవులున్నవా? కానీ యివన్నియు వారేమాత్రము యోచించలేదు. ఈ పరిశోధనలలో పలవారి కాలము వ్యర్థము చేయలేదు. 'నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై జల్లెడివాడు' యీ విధముగా వర్ణిస్తూ ఓ మల్లియలారా! మీరెవరైనా కృష్ణున్ని చూస్తిరా అని ప్రశ్నించారులు. ఇది ప్రేమతో ఆవిర్భవించినటువంటి ప్రభావము. అది భక్తులకు భగవంతునికి మాత్రమే అర్థమవుతుంది కానీ యితరులకు అర్థము కానిది.

గోపాలుడు గోపాలురతో, గోవులతో వత్సలతో అరణ్యములో వుండిన సమయమునందు బ్రహ్మ యితనిని పరీక్షించగోరి గోవులను, గోపాలురను, వత్సలను దాచిపెట్టినట్లుగా భాగవతము చెప్పుతుంది. సర్వజ్ఞుడైనటువంటి కృష్ణుడు తిరిగి సర్వమును సృష్టించి తాను యే విధమైన కొరత లేకుండా యథాస్థితిగా తాను అనుభవించినట్లుగా మరి ఒక సంవత్సరము తరువాత వచ్చి బ్రహ్మ చూచినట్లుగా కూడను వర్ణిస్తుంది. ఈ విధమైన వర్ణనలు భక్తునికి కృష్ణునిపై వుండినటువంటి ప్రియశిష్యులకు, ఆ మోహములో మునిగినటువంటి చిత్తములకు చక్కగా అర్థమవుతుంది గానీ భగవంతుడు ఒకడే యని తలంచి బ్రహ్మ వేరు కృష్ణుడు వేరు, బ్రహ్మ కృష్ణుని పరీక్షించాడు అనేటువంటి విషయము సామాన్యమైన మానవులకు సందేహము కలుగుతుంది. ఈ సందేహము వల్ల మనయొక్క బోధలు వారు విశ్వసించలేకపోతుంటారు. కొన్ని కొన్ని సమయములందు ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల యొక్క స్వభావాన్ని కూడను విడివిడిగా మనము భావిస్తూ వర్ణిస్తూ వుంటాము. ఈశ్వరుడు రామనామమును స్మరిస్తూ వుంటాడని రమే రామే మనోరమే అని కొన్ని విధములైనటువంటి వాక్యములతో ప్రబోధలు చేస్తుంటాము. ఈనాటి విద్యార్థులు, యీనాటి విజ్ఞాన శాస్త్రము విలసిల్లిన చదువులకు కొన్ని విధములైన విరుద్ధ భావములుగా స్ఫురిస్తూ వస్తుంటారు. భగవంతుడు ఒక్కడే యని చెబుతూ, తిరిగి రాముడు ఈశ్వరుని, ఈశ్వరుడు రాముని కొన్ని విధములుగా పూజిస్తూ వర్ణిస్తూ వారి నామము వుచ్ఛరిస్తూ వుంటుంటే యివి కొన్ని పరస్పర విరుద్ధ భావములుగా గుర్తించటానికి అవకాశముంటువి. దానియందు వుండినటువంటి యదార్థమైన అంతరార్థము మీకు తెలుసును. కానీ అందరూ తెలుసుకొనేటువంటి శక్తి సామర్థ్యులు కారు.

ప్రేమస్వరూపులారా! మన భారతీయ పవిత్రమైన చరిత్రలయందు మహర్షుల యొక్క తత్వాన్ని అనేక విధములుగా కూడను వర్ణిస్తూ వుంటారు. కానీ ఆనాటి అంతరార్థములు, ఆనాటి పరిస్థితులు పురస్కరించుకొని, ఆనాటి కవులు, ఆ విధమైన మార్గాన్ని అందించి వుండవచ్చు. దీని అంతరార్థము వేరుగా వుండవచ్చును. ఇంద్రియ నిగ్రహులైనటువంటి వారు యీ విధముగా చలించరు. ఆ విధముగా చలించారు అనేటువంటి యీ గ్రంథముల ద్వారా ప్రపంచములోపల అనేక విధములైనటువంటి నాస్తికత్వము అభివృద్ధికి కూడను అవకాశము వుంటుంది. వారు యీ మతములకు, యీ కులములకు, యీ వర్ణములకు అతీతమైనటువంటి వారు. కనుక మీ ప్రబోధలయందు మతములు, కులములు, వర్ణముల గురించి మీరు యేమాత్రము కూడను

హెచ్చరించకుండా వుండుటయే చాలామంచిది. ఇందులో మీరు యేమాత్రం ప్రవేశించటానికి వీలుండదు. కేవలము యీప్రజల ఆనందము నిమిత్తమై మనము అనేక విధములైన యిటువంటి చిన్న చిన్న విషయాలలో ప్రవేశించి మనయొక్క ఘనతను కోల్పోవటానికి వీలవుతున్నట్లుగా చేసుకుంటున్నాము. ఈ అనంతమైన, అఖండమైన దైవత్వాన్ని మనము అల్పత్వముగా భావించుకోటానికి కూడను అవకాశము నందిస్తున్నాము. సర్వజ్ఞుడైనటువంటి దైవత్వాన్ని కించపరచటానికి కొంతవరకు అవకాశమునందిస్తున్నాము. భారత, భాగవత, రామాయణాన్ని పురస్కరించుకొని వాటియందు భగవంతుడు ఆచరించినటువంటి కొన్ని కర్మలను మనము సమాజములో కొన్ని విరుద్ధమైనటువంటి భావములతో అందించినప్పుడు వారికి కొంతవరకు అనుమానాస్పదమునకు అవకాశము నందించినవారమవుతాము.

కొన్ని చిన్న ఉదాహరణములు. ఈ పాండవులు యింత భక్తులే. పరమాత్ముడే అన్ని విధములుగా అండదండలుగా వుండినటువంటి పాండవులకు యీ కష్టములెందుకు ప్రాప్తించాలి. అది ఒక ప్రశ్న. శ్రీమన్నారాయణుడే రామావతారమెత్తి అతని భార్యకు యిన్ని కష్టములు కలుగవలసినటువంటి అవసరమేమిటి అని మరొక ప్రశ్న. ఇంద్రియాతీతుడు, గుణాతీతుడు అయినటువంటి భగవంతునకు యీవిధమైనటువంటి సంసారములు కట్టడమనేటువంటిది సరియైనటువంటిదేనా అని మరొక ప్రశ్న. కాని యీప్రశ్నలకు మనము యేమాత్రము గురికానక్కరలేదు. దైవతత్వములో వుండినటువంటి అంతరార్థము వేరుగా వుండవచ్చును గాని బాహ్యార్థాన్ని పురస్కరించుకొని మీరు యీవిధమైన అవకాశమును ఆధారముగా చేసుకొని వాదోపవాదములలో దిగవచ్చును. వాదములవల్ల విరోధములు పెరుగునే కాని తరగవు. కనుక సాధ్యమైనంతవరకు యీ మహనీయులందరు కేవలము దైవత్వాన్ని యేకత్వముగా విశ్వసించి, దైవత్వము అఖండమైన, అనంతమైన వ్యాపకత్వమని బోధించటానికి తగిన కృషి చెయ్యాలి. అనేకత్వములోని యేకత్వమును వారికి బోధించటానికి పూనుకోవాలి. ప్రతిఒక్కటికూడను అనుభూతిలోనికి తేవటానికి తగిన కృషి చేయాలి.

ఈనాటి పరిస్థితిలో పల్లెలయందు కూడను కేవలము విజ్ఞానము అభివృద్ధిగాంచుచూవచ్చుచున్నది. ఎక్కడ సన్యాసిని చూచినను నీవల్ల యీసమాజమునకు కలిగేటువంటి మేలు యేమిటి? మీరు చేసేటువంటి పనియేమిటి. అని ప్రశ్నించేటువంటి అవకాశము యీనాడు యేర్పడింది. ఒకానొక సమయములో మళయాళస్వామి దీనియందే ఒక పద్యము వ్రాసి ప్రచారము చేశారు. అది సత్యమైనప్పటికి దానియందున్న అంతరార్థాన్ని అందరూ గుర్తించుకొనే శక్తిసామర్థ్యములు కలుగరు.

కాషాయ వస్త్రంబు కట్టినమాత్రాన - కరతలామలకంబు కాదు భక్తి
నోటితో నామంబు వుచ్ఛరించుటచేత - చేసిన పాపంబు చెదరిపోదు
గీతను చేబట్టి కేకలువేసిన - పుణ్యంబు మనయింట ప్రోగుపడదు
చెప్పు మాటలకు చేసెడి చేతలకు - సంయమున్నవాడె సాధువగును.

అన్నారు. మళయాళస్వామి యీవిధమైన విషయాన్ని అనేకమంది శిష్యులకు బోధించేటువంటివాడు

అతను చాలా చిత్తశుద్ధి కలిగినటువంటి వాడు. పవిత్ర హృదయము. విశాలమైన భావము. కానీ అతని యొక్క గురుత్వాన్ని మీరు అనేక విధములుగా వర్ణిస్తూ వుండినప్పటికిని అతని ఆశయాలను మాత్రము అతను ఆశించినట్లుగా మనము నెరవేర్చలేకపోతున్నాము. కేవలము యిట్టి సమావేశముల యందు మాత్రమే గురువును స్తోత్రము చేయుచు కొన్ని పది నిముషములైనా మనము వ్యర్థము గావిస్తున్నాము. ఈ గురువు అనేటువంటి వాడు విలువలేనటువంటి మాణిక్యము వంటి వాడు. ఇది రత్నము వంటిది యీ గురువు యొక్క నామము. ఈ రత్నమును బట్టి బయలుగా మార్కెట్టులో పెట్టి అమ్మటానికి యెవ్వరూ ప్రయత్నించరు. ఇది చాలా భద్రమైనటువంటి గాడ్రేజిలో పెట్టి చాలా భద్రము చేస్తారు. కనుక మొదట గురువు యొక్క నామమును మీరు బహిరంగముగా వుచ్ఛరించనక్కరలేదు. మీ హృదయములో వుచ్ఛరించి ప్రార్థించి తిరిగి ఆ కాలమును కూడను ప్రజలకు వుపదేశము చేసేటువంటి విషయాలలో దీనిని ప్రవేశపెట్టినప్పుడు మీరు యెంతో వుపకారము చేసినవారౌతారు. నీ వెంటనే, జంటనే, కంటనే, యింటనే వుండినటువంటి గురుత్వానికి మనము బహిరంగముగా యెందుకు ప్రార్థన చేయాలి? నేను యిచ్చినటువంటి పది నిముషముల లోపల యీ గురుప్రార్థనలో నే విడు నిముషములు పోతే ప్రజలకు అందివ్వవలసిన విషయములో నా కాలము తగ్గిపోతుంది. ఒక్క తూరి చిత్తములో నీవు నమస్కరించుకొని గురువు అనుగ్రహమును అందించమని కోరి నీవు ప్రారంభించుము. ఈ విధముగా మనము కాలమును కూడను పోషించుకోటానికి ప్రయత్నించాలి. కాలాయ నమః, కాలకాలాయ నమః, కాలనిర్ణీతాయ నమః అని కాలమే భగవత్ స్వరూపుడు. కనుక కాలమును మనము అరక్షణం కూడను వ్యర్థము చేయకూడదు. మనము యీ విధమైన కొన్ని మార్పులను గావించుకొని సమాజములో మనము ప్రవేశించి సరియైనటువంటి ఆదర్శవంతమైన రూపములో యీ మార్పు కల్గించినప్పుడే మనము సన్యసించినందుకు, ప్రచార ప్రబోధలలో ప్రవేశించినందుకు, తగినటువంటి సార్థకతను, ఆశించిన ఆశయాలను అందుకోటానికి వీలవుతుంది.

దివ్యాత్మస్వరూపులారా!

వ్యక్తిముక్తి గోరుట స్వార్థమగును
తానె తరియించ గోరుట ధర్మమగునా?
పరుల తరియింప గోరుటె భాగ్యమగును
తరచి చూడ అతనె నిజమైన మానవుండు.

తనకు తాను తరించుకోటానికి తగిన ప్రయత్నము కంటె తనతోటి మానవులను తరింపచేయటానికి తగిన కృషి చేయటమే సమిష్టిస్వరూపమైన సర్వేశ్వరుని ప్రార్థించినట్లుగా వుంటుంది. ఇదియే త్యాగేనైకే అమృతత్వమానసు. ఇట్టి త్యాగమునకు మనము సిద్ధముగా వుండాలి.

మరొకటి. నేను అధికముగా కాలము తీసుకుంటుంటె తప్పక విరమించుకుంటాను. కానీ మనయొక్క వ్రతము నందు యీనాడు కడపటి దినము. కనుక మనము కొన్ని కొన్ని విషయములు అధిక కాలము తీసుకున్నప్పటికినీ దీనిని సరైన రీతిలో తీర్చిదిద్దుకొనుటకు మనము

తగినప్రయత్నము చెయ్యాలి. మరొకటి యేమనగా మనము శిష్యులపైన ఆధారపడి వుండకూడదు. కారణమేమనగా మనము వారికి దాసులుగా మారిపోతాము. మనకు వారు దాసులు కావాలిగాని మనము వారికి దాసులు కారాదు. మనము ఒక్కరికి మాత్రమే దాసులము. అదే దైవానికి మాత్రమే దాసులు కావాలి. కారణమేమనగా మన ఆశ్రమముల అభివృద్ధిని విత్తమై, సరియైనటువంటి పోషణానిమిత్తమై వారిని ఆశించవలసి వస్తున్నది. ఆశకు దాసుడైన మరి జగమంతటికిన్ దాసుడే కదా. నిజముగా మన కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటూపోతే మన కార్యములకు యెట్టి ఆటంకములు జరుగవు. ఏ ఒక్క తక్కువ మనకు వుండదు.

ప్రేమస్వరూపులారా! మీరు నమ్మవచ్చు నమ్మకపోవచ్చు. దానికి నేనే యదార్థము. నేనే నిదర్శనము. ఈ దేహమునకు 61 వ సంవత్సరము ప్రారంభమైనది. ఇంత కాలమైనా, ఒక్క ఆ రక్షణమైనా కూడను యెవ్వరినీ నేను యీ చేయి చూపలేదు. నా కిది కావాలని నేను యేనాడు కోరలేదు.

సాయి కున్నట్టి ఐశ్వర్య సంపదలకు సాటి సంపద కలదె
యే వారికైన యే నాటికైన.

సాయి ఐశ్వర్యమేమన్న స్వార్థరహితమైన నిత్యనిర్మలమైన ప్రేమ ఒక్కటే ఒక్కటే అదే సాయి ఐశ్వర్యము. ఈ ఐశ్వర్యమును మనము అభివృద్ధిగావించుకుంటే యీ ప్రపంచమంతా కూడను మన చేతిలో ఒక బంతి మాదిరి ఆడించుకోవచ్చు. మీ సాధనలు మీరు చేయండి. మీ యొక్క సమాజములో ప్రవేశించి ప్రజలకు మీ సాధన యొక్క అనుభూతులను అందివ్వటానికి ప్రయత్నించండి. భగవత్ విశ్వాసమును యీ ప్రజలలో పలపెంపొందింప చేయండి. అనాదికాలమునుండి దైవత్వాన్ని అనేక విధములుగా చాటినటువంటి దేశము యీ భారతదేశము. కానీ ఏను గుయెటుల తన బలము యెరుగలేదో అట్లు తైనారు మన భారతీయులు నేడు తన బలమును తన శక్తిని, తన విశ్వాసమును తాము గుర్తించుకోలేకపోతున్నారు. మన మెందులకు దీనులమవుతున్నాము. మన మెందులకు తక్కువవారమవుతాము. మనకు ధనము లేదా గుణము లేదా, బలము లేదా? సర్వబలములు కూడను దైవత్వమే. విద్యను నేర్పును అవనిని. విద్యాగరిపేటువంటి వాడు తానే. బుద్ధి కలిగింపచేసేటువంటివాడు తానే. ఉద్ధారకము చేసేటువంటి వాడు తానే. అన్ని విధముల ఆదరించేటువంటి వాడు తానే. అతను మీ అండదండగా వుంటున్నప్పుడు పరులకు మనము యెందుకు చేయి చూపాలి? మహనీయులారా! పవిత్రమైనటువంటి మీ జీవితము యెంతనో ధన్యమైనటువంటిది. కాలకర్మకారణ కర్తవ్యములు కలిసి వచ్చినప్పుడే యీ కరుణ కూడను చేరివస్తుంది. పరిపక్వస్థితికి వచ్చినపుడు వృక్షమునుంచి వైరాగ్యముతో ఆ ఫలము క్రిందరాలుతుంది. మీరు సమాజములో ప్రవేశించి ప్రజలలో పలయీ దైవభావమును, పాపభీతిని వారిలో నెలకొల్పి, వారిని అభివృద్ధిగావించటానికి వారిని మీతో అనేక విధములుగా సహకరించటానికి తగిన కృషి చెయ్యండి. మీకు అయినటువంటి ఖర్చులుగానీ, బాధ్యతలుగానీ నేను చూచుకుంటాను. అంతేకానీ పరులదగ్గరకి పోయి మీరు ఆశ్రయించటానికి యేమాత్రం కూడను తల వంచకండి. చేయిచూచకండి. అదినాకు మీపై వున్నటువంటి ప్రేమతత్వము చేత. మరుయెంతో నిర్మలచిత్తులు, నిస్వార్థపరులు అయినప్పటికి మీ అవస్థలు గుర్తించి నాకెంతో కష్టంగా వుంటుండాది.

ఆదరించేటువంటివారు యెన్నో మాటలు అని తదుపరి ఆదరించటానికి పూనుకుంటున్నారు. అందుచేత ఒకరితో అనిపించుకోటానికి మీరు యేమాత్రం సిద్ధంగా వుండకండి. ప్రపంచములో యెన్నికోట్లమందో వున్నారు. అందరూ సన్నసించూరా. ఇది ఒక అదృష్టము. అది మీయొక్క భాగ్యము. ఇది ప్రయత్నముతో లభించేటువంటిది కాదు. అదృష్టములోనే ప్రాప్తిస్తుంది. ఈ ప్రాప్తించిన యీస్థానాన్ని సద్వినియోగము చేసుకొని యితరులకూడను దానిని సద్వినియోగపరచటానికి తగిన కృషి చేయటమే నిజముగా మీ ప్రధానమైన కర్తవ్యము. దైవమునకు ముద్దుబిడ్డలుగా మీరు తయారయ్యారు. అట్టి దైవాజ్ఞ మీరు శిరసావహించి, అన్యఆశలను కట్టిపెట్టి, దైవప్రచారమే మీ ప్రధానమైన కర్తవ్యమని విశ్వసించి దేశము ప్రాచీనకాలమందు యేవిధముగా వున్నదో ఆవిధముగా తిరిగి పునరుద్ధరించటానికి తగిన కంకణము కట్టుకోవాలని ఆశిస్తున్నాను. దైవముయొక్క నామమునకు మనము భేధము యేమాత్రము బోధించరాదు. ఏనామము, ఏరూపము, ఎవరి యిచ్ఛ యేరీతిగా వుండునో దానిని తగినటువంటి రీతిగా అనుసరించమని బోధించాలి. ఒక జాతి మత కులముల భేధములను యేమాత్రము మనము హెచ్చరించరాదు. కారణమే మనగా మీరు యేజాతికి చెందినవారు కారు. ఏమతమునకు చెందినవారు కాదు. దైవమతమునకు మాత్రమే చెందినవారు. బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్ర అనేటువంటివి సామాన్యమైన అమాయకులు అనుభవించేటువంటిది.

శాస్త్రంబులెప్పుడు సత్యంబుగానెంచు
వేదసమ్మతమగు విప్రులారా!
దేశంబు కారకులై దేహ మర్పణచేయు
రతియుంచు రాజాధిరాజులార.
ధనధాన్యములు కల్గి ధర్మ గుణంబులతో
అరయుచుండెడి ఆర్యవైశ్యులార
వ్యవసాయ వృత్తిచే వర్ధిల్లుచుండియు
సుఖ జీవనము చేయు శూద్రులార.

దీనినే పురుషసూక్తమునందు బ్రాహ్మణోస్యముఖమాసీత్ బాహూరాజన్య.. యీవిధముగా బోధించటములో బ్రాహ్మణులనేటువంటివారు ముఖము వంటివారట. క్షత్రియులు భుజములవంటివారట. వైశ్యులు తొడలవంటివారట. శూద్రులు పాదములవంటివారు. ఈనాలుగు చేరిననేకదా దేహము. దీనిలో ప్రత్యేకత యెక్కడ వుంటుండాది. అంతా ఒక్కటే. అంతా ఒక్కటే. అంతా ఒక్కటే. ఇవి కేవలము దేహములో వుండినటువంటి అంగములయొక్క పేర్లు మాత్రమే, కానీ జాతి మతముల పేర్లు కాదు. కాలికి ముల్లు గుచ్చుకుంటే కన్ను యేడుస్తుంది. అనగా శూద్రులు బాధపడుతుంటే బ్రాహ్మణులు బాధపడాలి. దానికి విచారించాలి. తల యేదైనా బాధగా వుండంటే కాలు ఒక్క అడుగైనా ముందంజ వేయలేదు. కనుక వీరందరు అన్యోన్య అనురాగముతో, సంబంధ బాంధవ్యముతో జీవించటానికి ఒకవిధమైనటువంటి సంబంధముతో కూడివుంటున్నది. కనుక యిందులో యేమాత్రం కూడను మనము భేధమును పాటించరాదు. బాషలు వేరు కావచ్చును. నామములు వేరు కావచ్చును. కాని అందరూ ఒకే జాతికి చెందినటువంటివారు. అదే మానవజాతి.

ఈ జాతికి అంతటికీ ఒక్కడే తండ్రి. అతడే భగవంతుడు. అందరూ ఆ భగవంతుని బిడ్డలమే అనేటువంటి సమత్వమును పెంచుకుంటూ, బోధించుకుంటూరావాలి. ఇదే నిజమైన మన అభిమతము కావాలి. ఇదే ఋషులయొక్క వ్రతము కావాలి. ఇదే మానవమతముగా తేజరిల్లాలి. ఈ విధమైన భావములచేత మీరు సమాజములో ప్రవేశించి మీ కర్తవ్యమును నిర్వర్తించటానికి మీ కడపటి శ్వాస పోయేంతవరకును మానవసేవ మాధవసే అనేటువంటి దానిలో మీ జీవితాన్ని అంకితం చెయ్యాలి.

ధనమునకు మాత్రము మీరు యేమాత్రం కూడను విచారించనక్కరలేదు. కల్పవృక్ష కామధేనువు అయినటువంటి భగవంతుడు మన వెంట జంటయింట వున్నప్పుడు మనకు విచారమెందుకు? అవిశ్వాసము లేనటువంటి వారికే విచారము. మన ప్రవర్తన మనము సరియైనటువంటి రీతిలో ప్రవేశపెట్టాలి. కొన్ని కొన్ని మన దురభ్యాసములు దూరము చేసుకోవాలి. మన రాగద్వేషాదులు నిర్మూలనము గావించాలి. సత్యాసులలోనే ఒకరిలో ఒకరికి యే విధమైనటువంటి భిన్నాభిప్రాయములు రాకూడదు. ఈ విధమైనటువంటి పరిపూర్ణ భావముతో మనము వుండినప్పుడే నిజమైన మానవత్వాన్ని వృద్ధిచేటానికి తగినటువంటి అధికారులమవుతాము. దీనినే వేదమునందు సహనావవతు. సహనౌ భునక్తు. సహవీర్యం కరవావహై--- ఈ మంత్రం యెందుకోసం చెప్పారు. దీనియొక్క అంతరార్థము యేమిటి?

కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం.
కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం
కలసిమెలసి కలిమి చెలిమి బలము గుణము పెంచుదాం.
కలసిమెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం
కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం
శాంతి శాంతి శాంతి యని శాంతి పూజ చేయుదాం
ఓంఓంఓం అనుచు ఓంకారము పాడుదాం.

ఇదే సహనావవతు, సహనౌభునక్తు, అనునటువంటి శ్లోకమునకు అర్థము. మనమందరము కలసిమెలసి పెరగాలి. కలసిమెలసి తిరగాలి. మనము తెలుసుకున్నటువంటి జ్ఞాన జ్యోతిని వెలిగించాలి. ఆ వెలుగు వచ్చేటువంటి అర్థములో మనము ముందంజవేసి దానిని తొలగించుకోటానికి, యెదుర్కోటానికి తగినటువంటి బలమును సంపాదించుకోవాలి. కలసిమెలసి కలత లేక చెలిమిగ జీవించుదాం. కలతలేకుండా జీవించాలి. మనలోని శాంతిభావములు అప్పుడే మనకు శాంతి. ఆ శాంతిపాఠము శాంతిశాంతిశాంతి అనేటువంటి దాంట్లోనే శాంతి లేకపోతే యికమనం శాంతి దేనికోసం చెబుతున్నాము. ఈ శాంతిని కూడను శాంతముగానే శాంతిశాంతిశాంతిః శాంతముగానే చెప్పాలి. కనుక యిలాంటి పవిత్రమైన భావములు మీయందు లేకపోలేదు. నేను ప్రత్యేకముగా మీకు చెప్పటమని కాదు. కానీ మనము మనకు వున్నటువంటి దోషములను పోనీ, మంచిని మనము చేర్చుకోటము కూర్చుకోటము యిది మనస్వభావము. మనము చేయవలసినటువంటి ప్రధాన కర్తవ్యము. కనుకే నేనేను వున్న విషయములంతా మీకు యీ విధముగా తెలుపుతూవచ్చాను. మీరు వేరుగా భావించరాదు. మీరు దేశాన్ని యిక యెంత ముందుకైనను తీసుకుపోవటానికి

తగిన శక్తి సామర్థ్యములు కలిగినటువంటి వారు కనుక మీరు మీ యొక్క శక్తిని తలుచుకుంటూ యే విధముగా ఏకోహం బహుస్యాం అని తనను తాను సంకల్పించుకొని జగత్తంతా యే విధముగా సృష్టించెనో ఆ విధముగా మీరు కూడా ఏకోహం బహుస్యాం నాలో వున్న జీవశక్తి వికశించుగాక, ప్రకటించుగాక, అని ఆనందాన్ని తీసుకోవాలి. పొందాలి. అదే ధైర్యము. మనము బలహీనులమని యే మాత్రము భావించకుండా సర్వబలములు మనయందున్నవనే విశ్వాసాన్ని పెంచుకుంటే సర్వశక్తులు మనకు చేరుతాయి. మీరు మీలో భజనలు తెలిసినవారు సమాజములో ప్రవేశించి నగర సంకీర్తనము చేస్తూ సాయంకాలము గ్రామస్తులనందరిని చేర్చి వారితో భజన చేయించండి. ఉపన్యసించలవారు గ్రామములలో ప్రవేశించి ప్రతిసాయంత్రము యిండ్లకు చేరే రైతులను సమావేశపరచి భగవత్ తత్వాన్ని వారి హృదయాలకు హత్తుకునేటట్లుగా బోధించండి. ప్రజలు దురభ్యాసముల చేత సంసారములను కూల్చుకుంటున్నారు. వారి దురభ్యాసములను మాన్పించి సదభ్యాసములను పెంపొందింప చేసి వారి కుటుంబములకు ఆనందాన్ని అందించండి.